

# ప్రతిక్రియ

శ్రీనివాస్

"సంసారం సాఫీగా సాగిపోవాలని, జవసత్వా లుడిగిన మాకు మనశ్శాంతి లభించాలని, క్షణ కాలమైన మెదడుకు విశ్రాంతి నిద్దామని చూస్తున్నాను కదా—ఛీ ! పాడు సంసారం..." విసురుగా వెళ్లిపోయాడు రంగారావ్.

ఇల్లు నిశ్శబ్దా న్నావహించింది. హాల్లో ఉన్న నలుగురిలో ఎవరి నోటంటా మాటా మంతీ లేదు కాసేపటిదాక.

అవును మరి ! ఆనందం కోసం, సుఖం కోసం, మనశ్శాంతి కోసం అలమటించిపోయిన—పోతున్న రంగారావ్ హృదయం ఎంతగా బాధ పడిందో— ఆ పలుకుల్లో సుస్పష్టమైంది.

ఆశల్తో పెనవేసుకున్న ఆనందం అగాధంలో పడి చొచ్చుకుపోయింది.

—కారణం .... అది ఒక విచిత్ర సంఘటన ....

రంగారావ్ నడవలో పేపరు చూస్తూ కూర్చున్నాడు. సత్తెమ్మ లోపల పని చేసుకుంటోంది. సుజాత ఎక్కడో మేడమీద కాబోలు—రేడియో వింటూ కూర్చుంది. వర్మ అప్పుడే కాలేజి నుంచి వచ్చి బట్టలు మార్చుకుంటున్నాడు. తన కోసమని టిఫిన్—కాఫీ—బల్లమీద నుంచి తొంగిచూస్తున్నాయి.

"అమ్మా ! .... అమ్మా !!"—ఇల్లదిరిపోయేట్టు కేకలు వినిపించాయి.

రంగారావ్ పేప రొదిలి బయటికేసి చూశాడు.

గడపదాటి తలుపుల దగ్గర పడివుంది మహతి. నుదుటిమీద రక్తపు మరకలు. తెల్లటి చీరంతా రక్తమయం—పాలిపోయిన ముఖం, భయంతో వణికే పెదవులు, కళ్లల్లో నీళ్ళ తిరుగుతూన్న కూతుర్ని చూసి చలించిపోయా డాయన.

తప్పతాగి తన్నాడు, ఇంట్లోంచి పొమ్మన్నాడు. పుట్టింటికి కాకుండా మరెక్కడికో వెళ్తుంటే తానే స్వయంగా తీసుకొచ్చి గుమ్మం ముందు వదిలి వెళ్లాడు. ఇది మహతి విషాదభరిత జీవిత గాథ.

లోకం దృష్టిలో నవ్వుల పాలైన కుటుంబం. మనోవ్యథతో మనశ్శాంతి లేని బ్రతుకులు.

# ప్రతిక్రియ

"ఏమేవ్ .... ఇల్లాలా"—ఆయన పిలుపు అందక ముందే ఇంట్లోవాళ్లంతా వచ్చారక్కడికి.

కొన్ని నిమిషాలు నిశ్శబ్దం—మహతి సన్నగా ఏడుస్తోంది.

"చూశావా ! మీ అల్లుడి ఘనకార్యం ... " కర్కశస్వరాన దొర్లిపోతున్నాయి రంగారావ్‌గారి మాటలు.

సత్తెమ్మ కూతుర్ని లేవదీసి—"చాల్లెండి—ఇప్పటికే కడుపులో మంటలు రేగిపోతోంటే .... గోరుచుట్టు మీద రోకలిపోటు లాంటి మాటలా—మీరూనూ"—లోపలికి తీసుకెళ్లింది మహతిని.

వర్మ బరువుగా నిట్టూర్చి చెప్పు తీసుకొన్నాడు.

"ఎక్కడికి వెళ్తున్నారు?"- ప్రశ్నించింది సుజాత.

'వల్లకాట్లోకి.'

"ఏమిట్రా దురుసుతనం. మళ్లా నీకేం వచ్చింది"—రంగారావ్.

'ఫలహారం చేసి వెళ్లండి.'

జవాబు లేదు.

"ఎప్పుడూ చూస్తున్నదేగా ! అన్నయ్యకు మంచి బుద్ధి రాదు. వదినెకి ఈ జన్మలో సుఖ శాంతులుండవ్ .... రండి .... ఫలహారం చేద్దురుగాని."

"సుజీ .... మాటలు తిన్నగా రానీ !"

'కొత్తగా కల్పించి నేనేం అన్నాను.'

"ఎక్కడికిరా ఇంతకూ ? అల్లుడింటికేనా ?"

'అవున్నాన్నా.'

"ఏం చేస్తావేం ?"

"ఏదో ఒకటి—"

"వాడ్ని చావ బాదుతావ్. అంతేనా !"

"చావ బాదటానికి బావగారు నాకంటే బలవంతులు."

"మరి ?"

"ఇచ్చి పుచ్చుకోడాలవల్ల, ఇరుపక్షాల సంసారాల్లో కారుచిచ్చులు రగుల్కొనే దానికి కారణమేమిటో—ఎదురు వియ్యం వల్ల జరిగే అనర్థాల్ని అరికట్టటానికి ఉపాయం .... ఇవ్వేళే తెల్సింది. అమల్లో పెట్టటాని కెళ్తున్నా."

రంగారావ్ మౌనం వహించాడు.

"మొదట్లో మర్యాదగా మాట్లాడుతాను. నయంగా నచ్చజెప్పుతాను .... "

"తర్వాత బెదిరిస్తావ్. తాటాకు చప్పుళ్లకి కుందేళ్లు బెదిరిపోవోయ్—ఏం చేసుకుంటావో చేసుకోపోవోయ్ అంటాడు వాడు. తెల్సా హా ! ఇలా అన్నవాళ్లే నామరూపాల్లేకుండా నాశనమైపోయారు. ఇహ నువ్వుద్ధరిస్తావ్ కాబోలు."

"ఆదర్శాలు చెప్పడం సులభం నాన్నా ! ఆచరణలో పెట్టడమే కష్టం. అలా ఆచరించాలనుకున్నవాడ్ని మీబోటివాళ్లు నిరుత్సాహపరచి పాతాళానికి తొక్కేస్తారు."

"అఘోరించావ్ లేవోయ్. నాకు మాత్రం మనసు చివుక్కుమనడంలేదూ ! తల్చుకుంటే కడుపు రగిలిపోతుంది బాధతో. నీ కొక్కడికే హృదయం ఉందనుకున్నావ్ .... అల్లుడు తాగుబోతు .... జూదరి .... వ్యభిచారని నా మొహాన్నే అనేస్తుంటే, తల దాచుకోడానికి చోటు దొరక్క చస్తుంటే—" దాసే సాగి, "ఏది చాతకాకపోయినా ఇంట్లోవాళ్లందరూ ములుకుల్లాంటి మాట లనడం నేర్చుకొన్నారు .... " ఆ మాట లంటున్న సమయంలో సత్తెమ్మ కూతురితో హాల్లో కొచ్చింది.

ఒక్కసారి కూతురు కేసి చూశాడాయన.

తలకి గుడ్డ కట్టుకుంది. చీర మార్చుకుంది. మొహాన చెదరిన బొట్టు.

—తిరిగి కొడుకు నుద్దేశిస్తూ, "నిన్నని ఏం లాభం ! నిన్నిలా తర్ఫీదు చేసిన వారి ననాలి కానీ" అన్నాడు.

"వాడికేం నే నేర్పలేదు. ఒకరు చెప్తే వాడు వినిపించుకునే రకం కాదని మీకు తెల్సుగా" అంది సత్తెమ్మ.

"ఏం జరిగిందిట"—కుర్చీలో చతికిల బడ్డాడు రంగారావ్.

"తప్ప తాగి తన్నాడు. ఇంట్లోంచి పొమ్మన్నాడుట. ఇక్కడికి రాకుండా మరెక్కడికో వెళ్తుంటే తనే స్వయంగా దారంటా నడిపించుకుంటూ తీసికొచ్చి గుమ్మం ముందు వదిలి పోయాడుట."

కొన్ని క్షణాలు నిశ్శబ్దం. "ఇక్కడికి రాకూడదనే నా అభిమతం. సుఖపడ్డా, కష్టపడ్డా ఆడదానికి అత్తిల్లే ఆధారం. కానీ వారు వెళ్లిపొమ్మన్నారు. అంతటితో వూరుకోక వారే నన్నిక్కడికి లాక్కొచ్చి వదిలారు"—రుద్ధ కంఠంతో అంది మహతి.

"అంతేనా ! ఇలా జరగడం ఇది ఎన్నోసారో ? మళ్లా మర్నాటికల్లా అన్నయ్య రాడూ ? వచ్చి కాళ్లా వేళ్లా పడి తీసుకెళ్తాడులే వదినె. నీవేం కంగారు పడక."

"సుజాతా !" అరచాడు వర్మ గట్టిగా.

"ఏం ? వదిన్ను వోదార్చకూడ దంటారా ?"

"నిన్ను నోరు మూసుకోమంటున్నాను."

చాలసేపు నిశ్శబ్దం. ఈసారి రంగారావ్‌గారు నిశ్శబ్దాన్ని భంగపరిచారు.

"అయితే తెగతెంపులు చేసుకొన్నాడనేగా వాడి చేష్టకి అర్థం. సంసారం సాఫీగా సాగిపోవాలని .... జవసత్వాలుడిగిన మాకు మనశ్శాంతి లభించాలని ......" చివాల్న లేచి రంగారావ్ విసురుగా వెళ్లిం దప్పుడే.

అదే మహతి విషాదభరితజీవితగాధ — అదే ఆ సంసారులకి భరింపశక్యముకాని బాధ.

మన్నుని తొలిచి పారేస్తున్న కుమ్మరి పురుగులు—మనోవ్యథతో మనశ్శాంతి లేని బ్రతుకులు.

లోకం దృష్టిలో నవ్వుల పాలైన కుటుంబాలు, లౌకికం తెలిసీ, సంస్కారం అలవడ్డా, దీపాన్ని, వండనుకునే పురుగులా క్షుద్ర తత్వాల్లోకి దిగజారిపోయిన బావగార్ని—ఎదురు వియ్యం వల్ల ఏర్పడ్డ కుటుంబకలహాల్ని అంతం చేయుటెలాగా—అని ఆలోచిస్తూ బయటి కెళ్లిపోయాడు వర్మ.

"హు ! రోజూ చచ్చేవాళ్లకి ఎవళ్లేడుస్తారు. ఎప్పుడూ చూస్తుండేదేగా .... ప్రతి చిన్న విషయానికి బాధపడే తత్వం ఈయనగారిది. ఇవ్వేళంతా ఇహ ఏకాదశి ఉపవాసం—శివరాత్రి జాగరణే ఈయనగార్కి. ఇలా వచ్చేవాళ్లు రాత్రి ఏ పదింటికో వస్తే ఆయనకేబాధా ఉండదు కదా"—తనలో తా ననుకున్నట్లున్నా, సుజాత మాటలు తల్లీ కూతు ళ్లిద్దరికీ విన్పించాయి.

"అవు నొదినా ! బండి విరిగిన వాడే వెర్రివాడు" అంది మహతి.

"నిన్నేం అనలేదమ్మా ! మీ అన్నయ్య ఫలహారం చెయ్యకుండా వెళ్తుంటే .... "

"బాధపడుతున్నావ్ కదూ. మరి నా మొహాన్నే మీ అన్నయ్య నంత చులకన చెయ్యడం బావుందీ. నీ కన్నయ్యని చనువుంటే మాత్రం—ఆయన నాకు భర్త."

రోగి—మీరిచ్చే మందు చాలా రోజులుగా తింటున్నాను. కాని జ్వరం మాత్రం తగ్గడం లేదు. కాస్త చెమట పట్టేమందు ఇద్దురూ, మీకు పుణ్యాం ఉంటుంది.

డాక్టర్—సరే, ఇప్పుడే వెళ్ళి బిల్లు పంపిస్తాను.

కోయిల్‌కర బన్సీలాల్
(నిజామాబాదు)

"మా అన్నయ్యని నేనేం తీసి పారేయలేదు" అంది సుజాత కటువుగా.

"మా వారెపుడూ ఒకర్ని యాచించింది లేదు. భర్త తన భార్యని తీసుకెళ్ళడానికి కాళ్ళా వేళ్ళా వద నక్కరలేదు. ఆయనకు నామీద సర్వాధికారాలున్నప్పుడు ఏమైనా చేసుకుంటాడు. నా బతుకే నవ్వులపాలట. ఇహ ఇక్కడికి రావటానికి వేళ పాళా ఎందుకు ?" మహతి సన్నగా ఏడ్చింది.

దాంతో సత్తెమ్మ లేచింది కోడలి మీదికి. "అక్కడ ఇంట్లోంచి పొమ్మంటే—ఇక్కడికి రాక ఎక్కడి కెళ్తాం దనుకున్నావ్. చావు బతుకుల్లో వుంటే ఇంట్లోకి రావటానికి సమయా సమయాలు కావా లేమిటి ? నీ సంసారం సుఖంగా ఉందని పొగరెక్కి పోతున్నావ్. నీ అహంభావమే నిన్ను నాశనం చేస్తుంది చూడు."

"అవు నత్తయ్యా. ఇక్కడి కొచ్చి ఆయన మనసు పాడుచేసి మా సంసారం నాశనం చేయడానికే పుట్టిం దీ మహతి. అత్తిల్లు వదిలిపెట్టి అనాథ శరణాలయా ల్లేకపోలేదు."

"ఆ .... ఆ.... ఏమే సుజీ! దండించేవాళ్ళు లేక నోటి కొచ్చిందల్లా వాగుతున్నావ్ ?"

"మరి నోరుండేది ఎందు కనుకున్నా రత్తయ్యా?"

"ఛీ. నీ వల్లనే దీని సంసారం అఘోగతి పాలైంది. వద్దండీ ఎదురు వియ్యం అచ్చిరాదని నెత్తి, నోరూ బాదుకున్నా ఆయన వింటేనా, కాదు కూడదంటూ మూడు ముళ్ళు వేయించారు. నీ పెళ్లిలో ఏ ముహూర్తాన పోట్లాడుకున్నామో...? తర్వాత ఏదో మాటాడబోయింది.

మహతి ఓ చావుకేక వేసి వెల్లకిలా పడింది. కాళ్ళు, చేతులు కర్రల్లా బిగుసుకు పోయాయి. గుడ్లు బయటికి పొడుచుకు వచ్చాయి.

రంగారావ్ గబగబా వచ్చాడు ఆ కేక విని. సత్తెమ్మ గొల్లు మంది. సుజాత బిత్తర చూపులు చూస్తూ మేడమీదికి పరుగెత్తింది.

"ఏం ఫర్వాలేదు. మూర్ఛపోయింది లేవే .... డాక్టర్ .... డాక్టర్" అంటూ తన గదిలో కెళ్ళి ఫోన్ చేశాడు.

మూడు రోజులు గడిచాయి. మహతిని తీసుకు పోవడానికి సారథి రాలేదు.

మహతి సహజంగా బక్కపలచగా ఉంటుంది. సారథి తాగొచ్చి తన్నే తన్నులకి, తిన్న అన్నం వంట బట్టక సగమైపోయింది. పైగా ఈ మనో వ్యథతో పూర్తిగా మారిపోయింది — చీపురుపుల్ల లాగు. రెండేళ్ళ క్రితం పెళ్లికూతురుగా పీటల మీద కూర్చున్న మహతికీ—ఇప్పటి మహతికి ఎంతో తేడా. చెల్లెల్ని చూస్తుంటే .... వర్మ గుండెల్లో ఆరిపోని మంటలకు వాయువు తోడై నట్టు సుజాత ఎత్తి పొడుపులు—ఏమీ పట్టించు కోక తన గది వదలిరాక లోలోపలే కృంగిపోతున్న తండ్రి బాధని బాయటికి చెప్పుకోలేక దిగ మింగడం దుస్సాధ్యం కాగా .... రెండు గోడల మధ్య క్రుంగిపోతున్న తల్లి—అందరూ స్మృతి పథంలో మెదలుతున్నారు. ఉదయం కాలేజి కెళ్తుంటే తన కుటుంబాన్ని, మహతిని గూర్చి మాటాడుకుంటూ సారథిని నిందిస్తున్న చుట్టు పక్కల వారి మాటలు చెవుల్లో ఇంకా గింగుర్లాడుతున్నాయి.

రాత్రంతా వర్మకి నిద్ర పట్టింది కాదు. మర్నాడు బారెడు పొద్దెక్కాక లేచాడు.

"అత్తగా రింటికి వెళ్ళదాయె .... అన్న య్యొచ్చి తీసుకుపోడాయె—ఇరువైనాలు గ్గంటలు ఏడుస్తూ కూర్చుంటే ఎలా గనుకుందో ? ఇంట్లో ఇంత పాచిపని పెట్టుకుని ఏ స్త్రీ మాత్రం అలా ఉండగా నే చూడలేదబ్బా—పనిచేస్తే 'ఫిట్సు' వస్తాయన్న సాకు బాగా దొరికింది. చివర కామె తిన్న కంచం కూడా నేనే కడగాలి. హుఁ. ఒకర్ని ఏం లాభం ? ఈ ఇల్లే సగం అరిష్టానికి మూలం. ఇంట్లో మనుషుల రాతలు సరేసరి."

—ఆ అంటున్నది సుజాతని వర్మకి బాగా తెల్సు. చిన్నప్పట్నుంచి ఇద్దరూ కలిసి మెలిసి చదువుకొన్నవాళ్ళు. స్కూల్ ఫైనల్‌తో ఆగి పోయింది సుజాత. తను మాత్రం చదువు సాగించాడు. ప్రేమలేఖలు రోజు కొకటి వస్తూండేవి. తనకి బుద్ధి తెల్సింది మొదలు సుజాతని పల్లెత్తు మాటనలేదు.

ఎంచాత అనలేక పోతున్నాడు ? నిజానికి అస్తమానం ఒకర్ని ఆడిపోసుకోడం తప్పుకదా! మరి తనెందుకు దండించలేక పోతున్నాడు. ప్రేమించాడనా ? చెల్లాయిని మాత్రం ప్రేమించలేదూ ? చెల్లాయి కోసం తనేమైనా చెయ్యగలడు. ఆమె సంసారం బాగుపడాలంటే .... బాగుపడాలంటే తను సుజాతను దండిస్తే .... పరిస్థితుల్లో మార్పులు రాకపోతాయా ? వస్తాయ్—చక్కబడుతాయ్ సంసారాలు—అబ్బా! ఎన్నాళ్ల కీ ఆలోచన తట్టింది!

"సుజీ—సుజాతా" ఇంటి పైకప్పు అదిరి పోయేలా అరిచాడు.

"ఎందు కలా గొంతు చించుకుంటారు"—ఓ నిమిషం తర్వాత వచ్చింది సుజాత.

"నీ గొంతుకంటే నాదేం పెద్దది కాదు."

"ఏం కావాలి మీకు? మీరు బాత్ రూంలో కెళ్లండి ... నే టవల్, సోపు పట్టుకొస్తాను". మారిపోయిన కంఠస్వరంలో తియ్యదనం—ఆ చూపుల్లో ఎంత చల్లదనం — క్షణం ముందున్న కాఠిన్యం—కోపం—కరిగిపోయాయి. ఆ స్థానే అనురాగం పెల్లుబికి వచ్చింది వర్మకి. చిరునవ్వు పెదాలమీద పరుగెత్తింది.

"కాఫీ రెడీగా ఉంచు .... వస్తున్నా"—స్నానం చేస్తుంటే మళ్ళా తను చేయా లనుకున్న ఘన కార్యం—మనః ఫలకంమీద నిలచింది. ఛా. తనొట్టి చవట. నాన్నగా రన్న దాంట్లో ఎంతో యథార్థ ముంది. తను బలహీనుడు. మనస్సు చంచలం. క్షణిక సుఖాలకి లొంగిపోయే ఉద్రేకి తను. బుర్ర వేడెక్కి పోతోంది—పైగా వేన్నీళ్ల స్నానం—నిస్సహాయుడికి కోపం జాస్తి—చేతిలోని చెంబుని విసరి కొట్టాడు. బాత్ రూంలోంచి బయట పడ్డాడు.

వంట గదిలో సత్తెమ్మ కట్టెల్ని పొయ్యి లోకి ఎగదోస్తూ కూర్చుంది. ఆమెకి చేరువలో మహతి తలొంచుకు ఉంది. ఉప్మా సాసర్‌లో పెట్టి, ఫ్లాస్కులోని కాఫీ గ్లాసులో పోస్తూ,


గ్లోరియా



మీ ముఖానికి కాంతిని, లేతదనాన్ని అందాన్ని తెచ్చును అన్ని షాపులలోను దొరకును

జనితా ప్రొడక్ట్సు, ఏలూరు, ఆంధ్ర

RATNAM'S N-OIL

అంగనరములు బలహీనతి చెంద. చిన్న దనతో తిరిగి సుధా ప్రకారం అయి పూర్తి సౌఖ్య మనుభవించుటకు 50 సం|| ప్రఖ్యాతి కలది. 1 సీసా రూ. 10 లు వి. పి. 1-4-0 కావలసినవారు ముందుగా 1-4-0 పంపేది. ఇంగ్లీషులో స్పెషల్ రకం అర్డెంటుగా పాములు రూ. 25-0 0 లు.

డాక్టర్ రత్నం సన్స్ (Estd 1904) మలక్ పేట బిల్డింగ్ ... హైదరాబాద్ -24 (ఆంధ్రప్రదేశ్)

హోమ్ సినీప్రొజక్టర్ 15రు/లకే



అద్భుతమైన గృహవినోద సాధనము కల్పన, సాహసము, అద్భుతముగల సన్నివేశము లన్నో యీ ప్రొజక్టరుతో మీ యింటియందే చూడండి. ఇది టార్చితో లేక ఎసి/డిసి ఎలెక్ట్రిసిటితో పని చేయును. ఉపయోగించదగు ఫిల్ము 35 ఎం.ఎం. బొమ్మలు తెరపై సజీవముగా పలుగంగులలో నటించును. మీకు ఆశ్చర్యము కలుగును అనేకులు ఆకర్షింపబడుదురు. ధర రు 15/- 40 అ|| ఫిలిం 4' × 3' సైజు స్క్రీను. దాని పనిచేయించే విధము, ఫిలిములపట్టీ ఉచితం. పోస్టేజి రు 4-50 అదనం. డీలక్సు స్పెషల్ ప్రొజక్టర్ ధర రు 25/ 60 అ|| ఫిలిం & 4' × '3 సైజు స్క్రీను. దాని పనిచేయించే విధము, ఫిలిములపట్టీ ఉచితం. పోస్టేజి రు 5 అదనం. అందరు కోరుచున్నారు! నేడే ఆర్డరు పంపండి.

BOLLYWOOD CINEMA CORP. (Regd.)
2194 Kalyanpura, Turkman Gate. (12
DELHI-6.




బాధాకరమును హేయకరము అగు
తామర ఇతర చర్మ
వ్యాధులను పోగొట్టుకోండి
శరీరమంతటా అవి పాకిపోవచ్చు



తామర, తీటలు-దురదలు, మేహ
తామరలు వంటివి అంటువ్యాధులు.
కుటుంబంలో ఇతరులకు కూడా
రావచ్చు. అమృతాంజన్ లిమి
వారి తామరమందు అట్టి చర్మవ్యాధు
లను క్రమముగా నిరపాయకరంగా
నివారించును. అమృతాంజన్
లిమిటెడ్ వారి తామరమందు డబ్బా
ఒకటి ఎప్పుడూ ఇంట్లో అందు
బాటుగా ఉంచుకోండి.




అమృతాంజనము
లిమిటెడ్ వారి
తామరమందు
అమృతాంజన్ లిమిటెడ్
14/15, లజ్ చర్చి రోడ్డు, మద్రాసు-4
బొంబాయి-1, కలకత్తా-1; న్యూ ఢిల్లీ-1

SWT-AM-R1146 Rev.

# ప్రతిక్రియ

"అణువడుచు ఆత్మాభిమానం కన్నీళ్ళ కారుస్తోంటే ఈ యింటి కెంత దరిద్రమో మీ కేం తెలు సత్తయ్య" అంది సుజాత.

"నా విషయం పట్టించుకోవద్దని నీ కెన్ని సార్లు చెప్పాను వదినా! నా కర్మ ఎలా కాలిందో అలాగే జరుగుతుంది."

"సుజీ"—కోపంతో వణికిపోయాడు వర్మ.

"కాకపోతే ఏమిటండీ? ఎపుడూ ఏడుస్తూ కూర్చోవద్దని చెప్పడం కూడా తప్పేనా! రేడియో, కేరమ్స్, సినిమాలు, ఎన్నో ఉన్నాయికదా, కాస్త మనోవ్యధని మర్చిపొమ్మని, మనస్సుకి విశ్రాంతి కల్పించుకోమని చెప్తున్నా. పరోపకారం చెయ్య బోతే—"

"నీ కెవరిచ్చారీ పెత్తనం—మహతి విషయం చూసుకోడానికి ఇంట్లో మరెవ్వరూ లేరా? నువ్వేనా పెత్తందారువి?"

"ఎవరూ పట్టించుకోకపోతే—"

"నోర్ముయ్."

"ఏం తప్పు చెయ్యిందీ ఎందు కలా కసురు కుంటారు. రామరామ! ఏమంటూ ఇంట్లో అడు గెట్టిందో ఈవిడ—అప్పట్నుంచి మీ మనసు పాడై పోయింది."

తనని లొంగదీసుకోడానికి ప్రయత్నం—స్త్రీ నిజంగా సమయస్ఫూర్తిలో గట్టిది. నిగ్రహం కూడదీసుకున్నాడు వర్మ. "అది మనసు బాగో లేక కుమిలిపోతూంటే సినిమా కెళ్ళమని సలహా యివ్వటం ఎత్తిపొడవడం కాదూ? దాని స్థానే నువ్వుంటే ఆ బాధ నీ కర్థమై ఉండేది."

"మహతిలా నేనేం తెలివితక్కువదాన్ని కాదు. మొగుడు తప్ప తాగి తన్నడాని కొస్తే—సరాసరి పోలీసుల్ని పిలిచి జైల్లో పడేస్తాను."

"పోలీసులా? జైలా? వద్దు—ఆయన్ని బాధించకండి. ఆయన కా శిక్ష విధించకండి. నన్నేమీ యిష్టం వచ్చినట్టు .... హిం .... సిం ... చం .... డి" స్పృహతప్పి పోయింది మహతికి.

వెల్లకిలా పడడంతో కుడిచెయ్యి తిన్నగా పొయ్యిలో కెళ్ళింది. అంతా నిశ్చేష్టులై పోయారు. కొన్ని క్షణాలకి తమాయించుకుని వర్మ మహతి చేతిని లాగాడు. చర్మమంతా కాలిపోయింది. సత్తెమ్మ బావురుమంది. ఎక్కడో ఉన్న రంగారావ్ పరుగెత్తు కొచ్చాడు—

"మళ్ళా ఏం కొంప మునిగిందే"—అంటూ.

అప్పటికి పూర్తిగా వర్మని అజ్ఞాతశక్తి ఆవ హించింది. తనేం చేస్తున్నాడో—ఏమో అతనికేం తెలియదు. అతని చెయ్యి సుజాత చెంపని చరి చింది. శక్తి ఉన్నంత వరకూ బాదాడు. ఆఖరికి రంగారావు అడ్డుపడి కొడుకుని అవతలి గదిలోకి లాక్కెళ్ళాడు.

అటు కూతురి సంసారం, ఇటు కొడుకు సంసారం—సర్వ నాశనం. ఇంటి యజమాని మనో వ్యధకి ఇంతకంటే మరేం అవసరం లేదు. ఇంత

కంటె ఘోరమైన సంఘటన జరగ నక్కరలేదు. తలను రెండు చేతులతో పట్టుకొని నేలమీద చతికిల పడ్డాడు. మొత్తానికి రంగారావు, సత్తెమ్మల గుండెలు బాధలకి అలవాటు పడ్డాయి కాబట్టి—అసంఘటనలకు మతి చలించి వీధులపాలు కాలేదు.

"నువ్వా ఇంతగా దిగజారి పోతున్నావ్రా." కొడుకుతో ఆ మాట అంటున్న సమయంలో రంగారావు కళ్ళు చెమ్మగిల్లాయి. అదాయన జీవితంలో మొదటిసారిగా జరిగింది.

జవాబు చెప్పకుండా డాక్టర్‌కోస మంటూ బయటికి నడిచాడు వర్మ. మరో పదిహేను నిమిషాల్లో రిక్షాలో డాక్టర్ని తీసుకొచ్చాడు. ఓ ఖాళీ గుర్రంబండి కూడా పక్కనే నిల్చింది.

"అదెందుకు ?"—రంగారావ్ ఆశ్చర్యపోతూ అడిగాడు. కొడుకు వినిపించుకోలేదు.

"సుజాతా ! నీ బట్టలవీ తీసుకో—"

మౌనంగా ఏడుస్తున్న సుజాత కా మాటలు పిడుగులు పడ్డట్టయింది. గుండెలు గుభేలుమన్నాయి.

"ఎందుకండీ ?"

"ఎదురు ప్రశ్నించావా .... చితగ్గొట్టాను."

.... .... .... ....

"ముందు పెట్టె బెడ్డు సర్దుకో."

.... .... .... ....

"ఊ—నీకే చెప్తుంట."

"మనిద్దరివా ?"

"కాదు—నీవే." తన జీవితంలో భర్త రౌద్రాకారం తొలిసారిగా చూసిన సుజాత భయంతో కంపించిపోక ఏం చేస్తుంది ? నోరు మెదపటానికి నిజంగా ఆమెకి ధైర్యం చాలింది కాదు.

పది నిమిషాల్లో తన సామాన్లు సర్దుకుంది.

"అయిందా ?"

"వూ."

'పదా'—అతను ముందు, ఆమె వెనక నడిచారు. మేడమెట్ల దగ్గర రంగారావ్, సత్తెమ్మలు నిలబడ్డారు. వారికి కాస్త దూరంలో డాక్టర్ మహతిచేతికి కట్టు కడుతున్నాడు.

"అత్తయ్యా." చేతిలోని సూట్‌కేసు జారిపోయింది. కన్నీళ్ళు కట్టలు తెంచుకు ప్రవహించాయి.

సత్తెమ్మ కోడల్ని లేవదీసింది.

"ఎక్కడికిరా కోడల్ని పంపుతున్నావ్ ?"

"బావ మహతిని చావ బాదితే ఆమె ఎక్కడికెళ్ళిందో అక్కడికే !"

"ఆలోచించి చేస్తున్నావా ?"

"ఆ."

"నలుగురూ నవ్విపోతుంది చాలకా—"

"ఎవరా నల్గురు ? వెధవలు. నవ్వుతారు. ఇనుప ముక్కని ఎర్రగా కాల్చి వరుస బెట్టి సమ్మెట పోట్లు వేస్తే కాని మనం చెప్పినట్లు వినదు వాన్న. నా ఆశయం నెరవేరితే—ఈ బాధలు, ఈ సమస్యలు, అన్నీ త్వరలో తీరిపోతాయి. దయచేసి నా కార్యానికి భంగం కల్గించకండి" అన్నాడు. కాసేపాగి—"పదా. ఏనాడు లేంది అత్తయ్యమీద ఇంత ప్రేమ ఎలాగొచ్చిందేం ? ఏడ్చి మొత్తుకున్నా నీకు సహాయం చేసేవా రెవ్వరూ లేరిక్కడ" —సుజాత నుద్దేశిస్తూ.

బండి కదలబోతున్నసమయంలో — సుజాత జాలిగా, దీనాతి దీనంగా భర్తకేసి చూసింది.

"నే నొద్దా మీకు ?"

"అక్కర్లేదు."

"ఎప్పటికీ ఇంతేనా ?"

"అవసరం వస్తే స్వీకరిస్తాను."

బండి కుదుపులకి సుజాత కన్నీళ్ళు జారి పడ్డాయి కింద. వాటిని తుడుచుకుంటూంటే వర్మ అన్నాడు మెల్లగా "మీ అన్నయ్య మా చెల్లాయిని వీధులెంటా నడిపించు కొచ్చాడు. కానీ నేను నిన్ను బళ్ళో పంపుతున్నాను. మీవాళ్లెవరైనా అడుగులే అన్ని విషయాలతో పాటు ఇదికూడా చెప్పు .... మర్చిపోకేం" అని.

* * *

రాత్రి సుమారు పన్నెండు గంటలు—తూలుతూ వచ్చాడు సారధి. తలుపు తట్టాడు. తెరచింది సుజాత. చెల్లెల్ని చూసి చిత్తయిపోయాడు. సగం నిషా వదిలింది.

"రా అన్నయ్యా"—ఆ మాటలతో ప్రకృతిలో పడ్డాడు.

"ఎప్పు డొచ్చావ్ ?"

"ఉదయం."

"వర్మ వూళ్ళో లేడా ఏమిటి ?"

—అత నలా ప్రశ్నించటానికి కారణం లేకపోలేదు. మునుపు ఎప్పుడైనా వర్మ వూళ్ళో లేకపోతే సుజాత తల్లిగారింటి కెళ్ళేది. అత్తగారింటికి, తల్లిగారింటికి మధ్య దూరం .... మూడు వీధులు మాత్రమే. వర్మ తిరిగొచ్చాడని ఎవరైనా కబురంపుతే తిరిగి వెళ్ళేది.

"ఉన్నారు. ఎక్కడికీ వెళ్లలేదు."

"మరెందు కొచ్చావ్ ?"

"ఈ అర్ధరాత్రివూట మాట లెందుకు ? తెల్లారి అన్ని విషయాలు మాటాడుకుందాం." తలుపేసి తన గదిలో కెళ్ళింది.

తెల్లారాక తల్లి ద్వారా అంతా తెల్సుకున్నాడు సారధి. తన భార్య మొద్దు స్వరూపం. తన అవసరా లేమిటో దానికి తెలియవ్. తను మాటాడుతుంటే అడ్డు ప్రశ్న లేస్తుంది. తన కనవసరంగా కోపం తెప్పిస్తుంది. తను రెచ్చిపోయి చావ బాదుతాడు. కానీ సుజాత కేం ? తెలివిగలది. సమయస్ఫూర్తిలో గొప్పది. అలాంటి ఉత్తమ ఇల్లాల్ని చావ బాదుతాడా ? వాడు మనిషైతే కదూ—అనుకున్నాడు.


వాస్తవానికి సుజాతంటే భయభక్తు లున్నాయి సారధికి. తను బతికుండగా ఆమె మీద ఈగ కూడా వాలనివ్వడు. కానీ నేడు వూహించని విధంగా ఆమె దర్శన మిచ్చింది. కళ్ళు ఏడ్చి ఏడ్చి వాచిపోయాయి. బుగ్గలమీద వాత లింకా మాసిపోలేదు. మొహాన బొట్టు లేని చెల్లాయి రూపాన్ని తల్చుకున్నప్పుడల్లా అతని నరనరాల్లో కోపావేశాలకి అవధు ల్లేకపోతున్నాయి. కర్తవ్యం కోసం ఆలోచిస్తోంది మనస్సు. చెల్లాయికి జరిగిన పరాభవాన్ని తల్చుకుని నిట్టూరుస్తోంది హృదయం. ప్రతిక్రియ చేయడానికి అత్తగారింటి కెళ్ళాలంటే అభిమానం అడ్డుపడుతోంది. ఉద్రేకంతో పొంగు లెత్తుతూన్న రక్తం—ఒక


అబలసుధ
స్త్రీలసమస్తవ్యాధులకుగ్యారంటీ:
ప్రదరము, ఋతుశూల, అకాల బహిష్టు, అత్యుష్ణము, గుండెదడ, నడుము నొప్పులు మొ॥ హరించి బలము నిచ్చును.
ధర. రు 3
ఇండియన్ మెడిసిన్ హౌస
విజయవాడ - 2

Tel: SOUND Phone No: 120.
స్త్రీలపాలిటి కామధేనువు
"డిస్మెక్యూర్"
(రిజిస్టర్డు)
(ఋతుశూలహారి)
వేలకొలది స్త్రీలు "డిస్మెక్యూర్" వాడి గంటునొప్పి బాధనుండి నివారింపబడిరి. గంటునొప్పి బాధను గ్యారంటీగా పోగొట్టును. వెల రు. 4-0-0
డాక్టర్ సి.మల్లిక్స్ ఫార్మసీ
విశాఖపట్నం
డిస్ట్రిబ్యూటర్సు :
వైజాగ్ రేడియో కో., విశాఖపట్నం-1



సర్వ గర్భాశయ వ్యాధులను పోగొట్టి, ఆరోగ్యమగు సంతానమును కలుగజేయును. అన్నిచోట్ల దొరకును. వెల 2-8-0
కృష్ణాలేబరేటరి బెజవాడ




# ప్రతిక్రియ

నిశ్చయానికి రాలేకపోతున్న ఆలోచనలు బుర్రని వేడెక్కిస్తున్నాయి.

ఉదయం పదిన్నరయింది. వరాసరి కాలేజి కెళ్ళాడు సారధి. 'స్టాఫ్ రూం' లో సిగరెట్టు కాలుస్తూ ఎవరితోనో మాటాడుతోన్న వర్మ బావని చూసి ఆశ్చర్యచకితు డయ్యాడు. క్షణం సేపు బుర్ర పనిచేయటం మానుకుంది.

'ఇల్లా రావోయ్ వర్మ'—పిల్చాడు సారధి.

తాగొచ్చాడేమోనని భయపడ్డాడు వర్మ. తన బావగారు ఎలాంటి వ్యక్తయిందీ కాలేజీ విద్యార్థులం కంతా తెల్సు. తన గౌరవాన్ని కాపాడమని కోటి దేవుళ్లకు మొక్కుకున్నాడు, తప్పనిసరిగా లేచి వెళ్లాడు.

'క్లాసు లేదా ?'

'ఉంటే ఇక్కడెందు కుంటాను ?'

'అయితే కాంటీన్ కెళ్దాం రా.'

కాంటీన్‌లో వో మూల కూర్చున్నా రిద్దరూ.

'కాఫీ తీసుకుందామా ? ఊఁ—'అడిగాడు సారధి.

'నే నిప్పుడే తాగాను. నువ్వు తీసుకో.'

'అవున్లే—పశువులకి కాఫీ సహించదు.'

'కొన్ని పశువులకి కాఫీ కంటే సారాయి బహు ఇష్టం.'

'వర్మా !'

'కాకపోతే ఏమిటోయ్ నువ్వనేది ?''

'మనిషైతే అలా సుజీని కొట్తాడా ?'

'మనిషి కానివాడితో వియ్యం పొందినవా రేమవుతారో ? చూడు బావ. మా చెల్లాయి కాబట్టి నువ్వు పెట్టే హింసలకి వోర్చుకుంటూ జీవచ్ఛవంలా బతుక తోంది. మరొకర్తైతే విడాకులిచ్చి మరో పెళ్లి హాయిగా చేసుకొనేవారు.'

'పోనీ అదే చేయించలేకపోయావ్ ?'

'చెప్పేవాడు చేసి చూపెడితే తక్కినవారు తప్పక వాణ్ని అనుసరిస్తారు.'

'అంటే.'

'ముందు సుజీతో తెగతెంపులు చేసుకుంటాను.'

'ఇక్కడ నీ ఆటలు సాగనిస్తా ననుకున్నావా ?'

'నువ్వు సాగనిచ్చే దేమిటి ? కోర్టువాళ్ళు అంతా చేసుకుపోతారు. నాల్గక్షరాలు రాసి పడేస్తే.'

కోపం మటు మాయమైంది. రక్తం చల్లబడింది. కొన్ని క్షణాలు నోరు మెదపలేకపోయాడు సారధి.

'అది నీకేం చేసిందని దాన్ని అన్యాయంలో ముంచటం'—చివర కన్నా డలా.

'మా చెల్లాయి నీ కేం చేసిందని—దాన్నలా చిత్రవధ చేస్తున్నావ్.'

'కోర్టు కెక్కితే నల్గురూ నవ్విపోతార్రా వర్మా.'

'ఇప్పుడు మాత్రం నవ్వటం లేదనా నీ ఉద్దేశం. ఇంతవరకూ నిన్ను గూర్చి అందరూ చెప్పుకుంటున్నారు. ఇహ నే నా పని చేసింతర్వాత నుంచి నన్నూ నల్గురూ అనుకుంటారు. ఒకర్ని మించినవా రొకరిని లోకం దృష్టిలో పడ్తాం. ఏం? ఇందులో తప్పేముంది ?'

కొన్ని నిముషాలు నిశ్శబ్దం. ''లేదా మర్యాదగా నీవు మసల్తూ, మహతిని బాధించకుండా ఉంటానని మాటిచ్చి—అన్నమాట నిలబెట్టుకున్న నాడు నేను సుజీని తప్పక స్వీకరిస్తాను'' అన్నాడు వర్మ మళ్లా.

''నీ నిశ్చయానికి తిరుగు లేదంటావా ?''

''మనుషుల మనస్తత్వాలు మారిపోతే నా నిశ్చయానికి మార్పురాక మానదు.''

'అంతేనా.'

'అంతే.'

వస్తుతః వర్మ పిరికివాడని సారధికి తెల్సు. కానీ వాడిలో ఆ మొండి ధైర్యం ఎవరు నూరి పోశారో వూహించలేకపోయాడు. సాయంకాలం కాలేజీ వదిలాక నాలుగు తన్ని వదిలిపెడ్తే దారి లోకి వస్తాడన్న ఆశతో లేచిపోయాడు సారధి.

'నిండా మునిగిన వానికి చలేమిటి ?'—అన్న సారధి మాటలు విన్పించాయి. ఆ మరు క్షణమే అతను కనుమరు గయాడు. వర్మ బరువుగా నిట్టూర్చి, 'తమదాకా వస్తే కానీ తెలియ దన్నారు పెద్దలు' గొణిగాడు.

సారధి అన్నంత పని చేశాడు. కాలేజీ వాతావరణం దాటాక రోడ్డుమీద నిండిన విద్యార్థుల మధ్యలో వెళ్తున్న వర్మని తల చిట్లిపోయేట్టు కొట్టాడు—వెనుక నుంచి.

'బాటనీ లెక్చరర్—వర్మగారు—పడిపోయార్—ఎవరో రెండు వేడి ఇడ్లీలు చెట్నీ తినిపించారహోయ్'' పిల్లల కేకలు అస్పష్టంగా విన బడ్డాయి వర్మకి. తర్వాత తెలివి తప్పిపోయాడు.

సైకిల్ రిక్షాలో ఇల్లు చేర్చారు వర్మని. ఎవరు కొట్టారో విద్యార్థుల కెవ్వరికీ తెలియదు. అందులో వర్మంటే ప్రతి ఒక్కడికీ భయభక్తు లున్నాయి. ఆయన క్లాసులో గోల చేయడాని క్కూడా బెదరుతారు. వాళ్లే డాక్టర్ని తీసు కొచ్చారు. కట్టు కట్టి, విశ్రాంతి చాలా అవసర మంటూ వెళ్లా డాయన.

ఇంట్లోవాళ్ల కంగారుకి దరిదాపుల్లేవు. రంగా రావు కేం పాలుపోక కుర్చీలో చతికిల పడ్డాడు. సత్తెమ్మ వర్మకి చేరువలో నేలమీద కూర్చొని విసురుతోంది. మధ్యమధ్య నిశ్శబ్దాన్ని భంగ పరుస్తూ తనలో తా నేదో గొణుక్కుంటూంది. మహతి ఎండిన మోడులా—శిలాప్రతిమలా నిల్చుని అంతా గమనిస్తోంది.

అన్నా—వదినెల దాంపత్యం చూసి అందరూ సంబరపడేవాళ్ళు. అలాంటిది తనొచ్చి ఇద్దరి మధ్య పోట్లాటలు పెట్టింది. చినికి చినికి వర్షమైంది. ఆఖరికి ఇంట్లోంచి వెళ్లగొట్టాడు వదినెని. దీని కంతా కారకు లెవరు ?

కాలేజీ పిల్ల లెవరూ కొట్టలేదుట. మరి, ఆయన చేసిఉంటా డీ పని. కాకపోతే అన్నయ్యని కొట్టడానికి తగిన కారణం ఉండొద్దూ ? మువ్మా

టికి తన భర్త చేసిన పనే యిది. ఆయన్నలా ప్రేరేపించటానికి కారణం—అన్నయ్య దెబ్బలు తినటానికి కారకు లెవరు ?

అన్ని విధాలా అమ్మ, నాన్నలకి మనశ్శాంతి లేకపోవటానికి కారకు లెవరు ? వాళ్ళ మనస్సుల్ని పాడుచేసే పరిస్థితులకి కారకు లెవరు ? క్షణానికో విషమ పరిస్థితిని తెచ్చిపెట్టేవా రెవరు ?

తనే—తనే నిజంగా. మరి తన వల్ల వీళ్ళకేం లాభం. కోరి కష్టాల్ని, దుఃఖాల్ని తెచ్చుకోడమేనా ? భర్త త్యజించిన భార్యకి ఆశ్రయ మిచ్చి తమ సంసారాల్ని బుగ్గిపాలు చేసుకుంటూ ఎందుకు ? తన కోసమా ? తనని కాపాడినందువల్ల వీళ్ళకి మంచంటూ లభించలేదేం ? తను పుట్టకనే ఉంటే— తనుండి మాత్రం—తనేం సుఖ పడుతోంది—తని సంసారులకి సుఖశాంతుల్ని అందించలేదా ? తనకేం చాతకాదా ? తనేం చెయ్య లేదా ? .... తన చాత కాదగ్గ కార్యం ఒక్కటే— దానివల్ల సుఖ శాంతులతో అందరూ హాయిగా ఉండగలరు. తనకోసం అందరూ త్యాగం చేస్తున్నప్పుడు—తనందరి కోసం త్యాగం చేయుటం సమంజసం కాదా ? దైవం కూడా తనని క్షమించవచ్చు .... తనా పని చేస్తే .... అలా దొర్లిపోతున్న ఆలోచనలతో అవతలి గదిలో కెళ్ళింది మహతి.

'నాకు తెల్సు. ఇదంతా అల్లుడి గాడి పనే. ఎప్పుడైతే సుజాతని ఇంట్లోంచి తరిమేశాడో—అప్పుడే అనుకున్నాను .... వీడికి తగ్గ శాస్తి జరుగుతుందిలే అని—అనుకున్నట్టే అయింది. అయినా వాడి చేష్టలకి హద్దంటూ ఉండాలా లేదా ? పోలీసుల కప్పగించి ఓ నెల కృష్ణజన్మ స్థానానికి పంపాలి వెధవని. ఎట్లాగూ నలుగురి నోళ్ళలో నాని పోతున్నామంటూ—ఇహ అల్లుణ్ణి కోర్టులో చూసి తృప్తి పడ్తాను.'

'ఛీ. ఏం మాట లండి అవి. అల్లుడో—గిల్లుడో మనకేం తెలుసు కొట్టింది.' సత్తెమ్మ అంది.

'మంచికి మంచి, మోసానికి మోసం, దగాకి దగా అంతే ! నువ్విలా అస్తమానం నస్సె పని చేయకుండా చవటని చేస్తున్నావ్. చూడు. అన్నంత పని చేస్తాను. నేను ప్లీడర్నని వాడికి తెలియదేమో. వాడు కొట్టించాడని సాక్ష్యం క్షణంలో సృష్టించగల్ను.' రుసరుసలాడుతూ పచార్లు చేస్తున్నాడు రంగారావ్.

వర్మకి బాగా తెల్సు—సారధి మనుషులే కొట్టారని. కానీ ఎందాతో నిజం చెప్పలేక పోతున్నాడు. మాట కోసమైనా నాన్న అన్నంతపని చేస్తాడని కూడా తెల్సు. పౌరుషాలు, పగలు మనుషుల కెక్కడ్నుంచి వస్తాయో, ఎలా ఉద్భవిస్తాయో—పాడు మనస్సు అహర్నిశం క్షుద్ర తత్వాల్లోకి దిగజారి పోతుంది. కానీ ఉన్నతమైన ఆశయాల వైపు తొంగిచూడదేం ?

'నాన్నగారు ! బావ కాదు నన్ను కొట్టింది.'

'కాదా ! నువ్వు చూశావా ?'

'చూశాను.'

'ఎవరు ?'

'విద్యార్థులు.'

'నిజంగా ?'

'నిజం.'

క్షణం నిశ్శబ్దం. ఉన్నట్టుండి చావు కేకలు విన్పించాయి లోపలనుంచి. యాంత్రికంగా రంగారావ్, సత్తెమ్మలు పరుగెత్తారు. బాత్ రూంలోంచి కేకలు విన్పిస్తున్నాయి. లోపల గొళ్ళెం పెట్టబడింది. కాలుతో రెండు తన్ను లిచ్చాడు. పెళ్ళున విరుచుకుపడ్డాయి తలుపులు. గప్పున పొగ—మంటలు లేచాయి. మంటల మధ్య మహతి కాలిపోతోంది. దిక్కు తోచక ఎగురుతోంది. కూతుర్ని స్థితిలో చూసిన సత్తెమ్మ మూర్ఛపోయింది.

దిగ్భ్రాంతుడై క్షణకాలం మైలు రాయిలా నిల్చుండి పోయాడు రంగారావ్. బెడ్‌రూంలోంచి చేతి కొచ్చిన వస్త్రం పట్టుకొచ్చి కూతురు వంటికి చుట్టబెట్టాడు. నేలమీద దొర్లాడింది మహతి.

ఈలోగా నెమ్మదిగా నడుచుకుంటూ అక్కడికొచ్చాడు వర్మ. 'ఏం జరిగింది' అంటూ, లోపల దృశ్యాన్ని చూసి విచలితు డయ్యాడు. శరీర మంతా భయంతో వణికిపోయింది. కాళ్ళలో శక్తి లేక చతికిల పడ్డాడు.

'నా శ్రాద్ధం జరిగిందోయ్. ఛీ. నిర్భాగ్యపు సంసారం. పాడు మనుషులు. చీడపురుగులు. అమ్మాయిని చూస్తుండు. డాక్టర్‌కి ఫోన్‌చేసి వస్తాను' దాదాపు పరుగెత్తాడు రంగారావు.

చెల్లాయి వో వేపు 'అబ్బా—మంటలు—వళ్ళంతా మంట'' అని రోదిస్తోంది. మరోవైపు సత్తెమ్మ తెలివితప్పి పడివుండటం చూసి నీరు కారిపోయాడు. ఆ గదిలోని దృశ్యాన్ని, ఆ వ్యక్తుల బాధల్ని, దుఃఖాల్ని వర్ణించ దుస్తరం.

ఏంబులెన్స్‌లో మహతిని హాస్పిటల్ చేర్చారు. మహతి ఆత్మహత్యచేసుకోబోయిందన్న వార్త క్రమంగా చుట్టుపక్కల ప్రాకి సారధి చెవిన కూడా పడింది. వార్త విని నివ్వెరపోయారు సుజాత—వాళ్ళ అమ్మా నాన్నలు. ఆమె ఆత్మహత్యకి ఎందుకు పాల్పడిందో సారధికి బుర్ర బద్దలు కొట్టుకున్నా బోధపడింది కాదు. చచ్చి ఏం సాధించా లనుకుంది అన్న ప్రశ్న రాకెట్‌లా దూసుకు పోతోం దతని మనస్సులో. అందరూ తమకి తెలియకుండానే హాస్పిటల్ చేరారు.

తెల్లవారు జామున నాల్గు గంటల సమయం—కళ్ళు తెరచిన మహతి చూపులకి .... రంగారావ్, సత్తెమ్మ, వర్మ, సుజాత, తన అత్త మామలు .... వరుసగా కన్పించారు.

'మహతి ! ఇటు చూడు' వో రుద్ధ కంఠం పిల్చింది. చూపులు మళ్ళించింది. తన భర్త ఎదుటున్నాడు. కన్నీళ్ళు కారుస్తున్నాడు. కృంగిపోతున్నాడు బాధతో. దుఃఖం పెల్లుబికి వస్తోంది. ఆపుకోడానికి పెదాల్ని బిగపట్టుకుంటున్నాడు. తర్వాత మహతి మరేం గమనించలేక పోయింది. తల తిరిగి పోతోంది. కళ్ళు మూసుకుంది. తెరచింది. మళ్ళా మూసుకుంది. మూల్గింది. ప్రపంచ మంతా తల్లకిందులై పోతున్నట్టుంది. భర్త చెయ్యి గట్టిగా పట్టుకుంది. రాయి గుండెల మనుషులు ఒక్కోసారి దుఃఖంతో కన్నీళ్ళు వదలుతూ ఏడుస్తారని తెలియ దామెకి. తన సుఖం కోసం భార్యని బైటికి గెంటించి నడి వీధిలో తల పగులగొట్టుకున్న అన్నయ్య లోపల ఎంతగా విలపిస్తున్నాడో తెలియ దామెకి. ఎత్తి పొడుపులతో బాధపెట్టి గుండెల నిండా ముళ్ళు గుచ్చిన సుజాత ఇప్పుడెంతగా పశ్చాత్తాప పడుతుందో తెలియ దామెకి. తల్లిదండ్రుల హృదయాల్లో తన ఈ ఆత్మహత్యాప్రయోగం ఎంతటి అశాంతిని రేకెత్తిస్తున్నదో తెలియ దామెకి. కోడల్ని నానా హింసలు పెట్టి, కొడుకుని వెనకేసుకొచ్చి—ఇప్పుడు కోడలికోసం ఎంతగా పరితపిస్తున్నారో—అత్తమామల మనోభావాల్ని తెల్సుకోలేక పోతోంది.

ఆమెకి తెల్సిందల్లా—తన ఆత్మహత్య, తన త్యాగం, పౌరుషాలతో పేచీలు పడ్డ కుటుంబాలు, విచ్చిపోయిన సంసారాలు, ఒకటి కాబోతున్నాయన్న సంతోషం. తన ఆశయం నెరవేరింది. చనిపోతూ తనో గొప్ప కార్యాన్ని సాధించగల్గింది. అన్న విషయం స్పష్టంగా తెలుసు.

డాక్టరొచ్చాడు—స్టేట్‌మెంటు కోసం. " .... బుద్ధిపూర్వకంగానే కాల్చుకున్నాను. జీవితంమీద రోత కల్గింది. ఇందులో ఎవరి వత్తిడి లేదు. నేనే—నేనే బాధ్యురాల్ని". ఆ మాటలు పల్కటానికే కాబోలు—ఆమె అంతవరకూ శక్తిని కూడగట్టుకు ఉండింది.

బ్రతకలేదు మహతి. బావురుమన్నా రంతా. చేతులు కాలింతర్వాత ఆకులు పట్టుకున్నాడు సారధి. ఈరోజు మహతి లేదు. లేవేలే దతనికి. మహతి మరణం మరో విధంగా సంభవించిఉంటే సారధి మనస్సంతగా విలపించేది కాదు. విచిత్రంగా వుందతనికి కంతా. కన్నీళ్ళు తుడుచుకుంటూ ఇలా అన్నాడు. "చిన్నప్పుడు తుమ్మెద కన్పిస్తే చాలు—దాని కాళ్ళు విరచి, రెక్కలు తుంచి, తోకకి దారం కట్టి గాల్లో ఎగరేస్తూ ఆనందించేవాడ్ని. బుద్ధి తెలిసి కూడా చూస్తూ చూస్తూ నా భార్యని నేనే చంపుకున్నా నిపుడు. చేసిన పాపాలకి ఫలితాన్ని ఇక్కడే ఈ జన్మలోనే అనుభవించాల్సి వస్తుందని ఇపుడిపుడే బోధపడుతోంది .... ఏది ఏమైనా నే నిక తాగుడు మానేశానని మహతి కెలా తెలుస్తుంది .... మహతి కెలా తెలుస్తుంది .... ఎలా తెలుస్తుంది."

పక్కనే నిలబడ్డ నర్సు మహతి మీద తెల్లటి దుప్పటి కప్పింది. ★

బాలిక - మామయ్యా! ఒకపిల్ల ఏనుగుపాలు త్రాగితే రెండు వారాలలో బరువు ఇరవై పౌన్లు పెరిగింది.

మామయ్య- ఏడిసినట్టుంది. అలా ఎన్నటికీ జరగదు. ఇంతకీ ఎవరిపిల్ల ?

బాలిక: ఏనుగ పిల్ల మామయ్యా.

—అవధానము రామగోపాల్
(ప్రొద్దుటూరు)